క్లుప్తంగా

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

పటమట(విజయవాడతూర్పు): కృష్ణా- గుంటూరు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయతోపాటు నగరలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలువుతున్నందున తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని చెప్పారు. విజయవాడ నగరవాసులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

సూర్యభగవానునికి పూజలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో సూర్యభగవానునికి ఆదివారం విశేష పూజలలు నిర్వహించారు. మాఘమాసం తొలి ఆదివారం పురస్కరించుకుని ఆలయంలో ప్రజల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ మహాసౌర అరుణ సూర్యనమస్కారాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణయంత్రాన్ని వేసి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మోదీ ప్రభుత్వం మొండి చేయి చూపిందని, విద్యను మరింత కార్పొరేట్, ప్రైవేటు రంగానికి ధారాదత్తం చేయడానికి బడ్జెట్‌లో చర్యలు తీసుకుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రసన్న కుమార్, ఎ.అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యూహ్యాలు విద్యలో అమలుకు చేసేందుకు పూనుకుందన్నారు. ఎన్ఈపీతో ప్రభుత్వం విద్యను సరుకుగా మార్చడానికి తన చర్యలతో వేగవంతం చేస్తోందని పేర్కొన్నారు. అది సమాజంలోని సంపన్న వర్గాలకు మరింత అందుబాటులో ఉండేలా చేస్తుందన్నారు. అదే సమయంలో అట్టడుగు నేపథ్యాల నుంచి విద్యార్థులకు నిధులు సమకూర్చే విద్య నుంచి మినహాయించే వాతావరణాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థకు కేటాయింపులు చేయలేదని మండిపడ్డారు. ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ, ఐఐఎస్ఈఆర్, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీలకు నిధుల ఊసేలేదన్నారు. రాష్ట్రాల హక్కులు లాక్కుని తన విద్య కేంద్రీకరణ కోసం, కార్పొరేటీకరణ కోసం పూనుకుంటుందని విమర్శించారు.

ఘాట్‌రోడ్డులో ఎగిసిపడిన మంటలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్ద ఆదివారం తెల్లవారుజామున మంటలు ఎగిసిపడ్డాయి. ఆలయ అధికారులు, సిబ్బంది, పోలీసులు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్ద ఇటీవల రిటైనింగ్ వాల్ నిర్మించారు. రిటైనింగ్ పక్కనే ఉన్న స్థలంలో పెద్దఎత్తున చెత్త పేరుకుయింది. ఈక్రమంలో ఆదివారం తెల్లవారుజామున ఒకసారిగా ఆప్రాంతంలో మంటలు ఎగిసి పడ్డాయి. మంటల తీవ్రతతో ఘాట్‌రోడ్డులో ఉన్న స్తంభానికి ఏర్పాటు చేసిన మైక్ వైర్లు, సీసీ కెమెరా వైర్లు దగ్ధమయ్యాయి. చెత్తలో గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో ఆలయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆలయం రజతోత్సవం ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): పటమట దర్శిపేటలో వేంచేయి ఉన్న శ్రీ రాజరాజేశ్వరి లలిత పరమేశ్వరి అమ్మవార్ల ప్రతిష్ట జరిగి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రజతోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 2వతేదీ నుంచి 6వ తేదీ వరకు 5 రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమయైన ఈ ఉత్సవాల్లో మహిళలు కృష్ణానది నుంచి జలం తీసుకొచ్చి పూజ చేసి ఉత్సవ విగ్రహాన్ని పటమట పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం చండీ హోమం, సాయంత్రం 6 గంటలకు మాఘ పంచమి సందర్భంగా కల్యాణోత్సవం చేస్తామన్నారు. సుమారు 5000 మందికి అన్న సమారాధన కార్యక్రమం చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బొప్పన భవకుమార్, అధ్యక్షులు ఆవుల నాసరయ్య, ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి నాగేశ్వరరావు, రాజరాజేశ్వరి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో గణపతిరావురోడ్డు

- గతంలో రోడ్డు విస్తరణ
- పాఠశాల, మినీక్లాత్ మార్కెట్ తొలగింపు
- నేడు ఆక్రమణల్లో ఆ ప్రదేశం
- ట్రాక్టర్ విడిభాగాల వ్యాపారం
- చోద్యంచూస్తున్న వీఎంసీ అధికారులు



గణపతిరావురోడ్డును అక్రమించి పార్కింగ్ చేసిన వాహనాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని ప్రధాన రహదారిగా ఉన్న గణపతిరావురోడ్డు ఆక్రమణలకు అంతులేకుండాపోయింది. గణపతిరావురోడ్డులోని కృష్ణవేణి మార్కెట్‌ను అనుకొని ఉన్న ప్రాంతమంతా పాతబస్తీలోని స్థానిక వ్యాపారులు, తమ వాహనాల పార్కింగ్‌కు వినియోగించుకుంటూ ఆప్రాంతాన్ని మురుగుకూపంగా మార్చారు. నగరంలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు తమ వాహనాలను ఇక్కడకు తీసుకొచ్చి రోజులతరబడి పార్కింగ్ చేస్తున్నారు. దానికి తోడు కూటమి నాయకుల ఆధ్వర్యంలోనూ కొన్ని వాహనాలను ఇక్కడ ఉంచి వ్యాపారాలను కొనసాగిస్తుండటంతో ఈ ప్రాంతం చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాఠశాల, మార్కెట్‌ను తొలగించి రోడ్డు విస్తరణ

గణపతిరావురోడ్డులో గతంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కస్తూరి సీతారామయ్య పేరు మీద ఏర్పాటు చేసిన నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాల, మహాత్మాగాంధీ మినీ క్లాత్ మార్కెట్ ప్రాంగణాలు ఉండేవి. కృష్ణా పుష్కరాల సమయంలో అప్పటి కూటమి ప్రభుత్వం గణపతిరావురోడ్డును విస్తరించాలని నిర్ణయించింది. పాఠశాలను పూర్తిగా తొలగించడంతోపాటు మహాత్మాగాంధీ మినీ క్లాత్ మార్కెట్‌ను మరో ప్రాంతానికి తరలించింది. అప్పటి ప్రభుత్వం విస్తరించిన రోడ్డులోని ఆ ప్రాంతాన్ని అలాగే వదిలేసింది. దీంతో పాతబస్తీలోని పలువురు వ్యాపారులు ఆ ప్రాంతాన్ని తమ సొంతానికి వినియోగించుకుంటూ అజమాయిషీ చేస్తున్నారు.

పాతట్రాక్టర్ సామగ్రి విక్రయాలు..



రోడ్డు ఆక్రమిత ప్రాంతంలో నిర్వహిస్తున్న పాతట్రాక్టర్ విడిభాగాల వ్యాపారం

గణపతిరావురోడ్డును అక్రమించుకుని పలువురు ట్రాక్టర్ విడిభాగాలు, ఇంజిన్ ఆయిల్, పాత ఇనుప సామగ్రి అమ్మే దుకాణాలు నిర్వహిస్తున్నారు. విస్తరణ చేసి ప్రాంతంలో తమ సామగ్రిని పెట్టి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోజుల తరబడి పాతట్రాక్టర్ విడిభాగాలను అక్కడే ఉంచుతుండటంతో ఆ ప్రాంతమంతా మురికిమయమవుతూ దోమలకు ఆవాసంగా మారింది. దీంతో పరిసర ప్రాంత ప్రజలు అవస్థలుపడుతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా..

పలువురు వ్యక్తులు తమ లారీలు, పాత వాహనాలను ఇక్కడ నిలిపి ఉంచుతుండటంతో ఆప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో మందుబాబులు అక్కడ ఉన్న వాహనాల్లోని మద్యం తాగుతూ తెల్లవారుజాము వరకూ తిష్టవేస్తుండటం గమనార్హం. దీనికితోడు గంజాయి సేవించే బ్లేడ్ బ్యాచ్‌లకు సైతం ఈ ప్రాంతం ఆవాసంగా మారిందని భయాందోళనలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా నగరపాలకసంస్థ అధికారులుగానీ, పోలీసు సిబ్బంది కానీ ఈ ప్రాంతంలో ఆక్రమణలను అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా అక్రమణలకు పాల్పడుతున్న వ్యక్తుల నుంచి సంబంధిత సిబ్బందికి నెలవారీ ముడుపులు అందుతుండటంతో వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా నగరపాలకసంస్థ ఉన్నతాధికారులు దృష్టిసారించి ఆక్రమణల తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కొండపై నుంచి దూకేందుకు యువకుడి యత్నం

- ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయం వద్ద ఘటన
- పోలీసులకు, దుర్గగుడి సిబ్బందికి ముచ్చెమటలు



పోలీసులు అదుపులో ఉన్న బాలరాజు



బాలరాజు కిందకు దూకేందుకు యత్నించిన ప్రాంతం ఇదే

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై నుంచి దూకేస్తానంటూ పలాసకు చెందిన ఓ యువకుడు ఆదివారం హల్‌చల్ చేశారు. దుర్గగుడి ప్రాంగణంలోని మల్లేశ్వరాలయం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పాట్నూరి బాలరాజు(32) జీడిపప్పు వ్యాపారంతోపాటు సూపర్ మార్కెట్ నడుపుతుంటాడు. కొంతకాలంగా వ్యాపారంలో నష్టం రావడంతో సుమారు రూ.3కోట్ల మేర అప్పులపాలయ్యాడు. ఈనెల చివరి వారంలో బాలరాజు వివాహం నిశ్చయమైంది. ఈక్రమంలో బాలరాజు తల్లిదండ్రులు ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లగా, బాలరాజు కొద్దిరోజుల కిందట విజయవాడకు వచ్చాడు. ఎలాగైనా తనగోడు డెప్యూటీ సీఎంకు చెప్పుకుందామని భావించాడు. నేరుగా డెప్యూటీ సీఎం వద్దకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో తాను చనిపోవాలని నిర్ణయించుకుని కొద్దిరోజులుగా దుర్గగుడిపై తిరుగుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో మల్లేశ్వరాలయం ఈశాన్య మూలలో ఉన్న ఇనుపగేటు తెరుచుకుని అవతలి వైపునకు వెళ్లిన బాలరాజు ఎవరూ రాకుండా గేటుకు తాళం వేశాడు. అక్కడి ఇనుప చువ్వలను పట్టుకుని తాను కిందకు దూకేస్తున్నానంటూ కేకలు వేశాడు. దీంతో అక్కడే ఉన్న భక్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులు బాలరాజును చూసి కంగారుపడ్డారు. వెంటనే ఆలయ సెక్యూరిటీ అధికారులతోపాటు పోలీసులకు సమాచారమిచ్చారు. మల్లేశ్వరాలయానికి చేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు సిబ్బంది కలిసి బాలరాజుకు ఎంత నచ్చచెప్పినా ప్రయోజనం లేకపోగా, తన వద్దకు ఎవరైనా వస్తే కిందకు దూకేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. ఎవరైనా ఫొటోలు, వీడియో తీసేందుకు యత్నించినా దూకి చనిపోతానంటూ కేకలు వేశాడు. ఈక్రమంలో అప్పటికే ఆలయంలో ప్రముఖుల బందోబస్తు విధుల్లో ఉన్న వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ మల్లేశ్వరాలయం వద్దకు చేరుకుని బాలరాజుతో మాట్లాడారు. తనతో వస్తే డెప్యూటీ సీఎం వద్దకు తీసుకువెళ్లతానని చెప్పారు. చివరికి ఫోన్‌ద్వారా డెప్యూటీ సీఎం పీఏతో మాట్లాడించడంతో శాంతించిన బాలరాజు అక్కడి నుంచి వెనుతిరగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పోలీసులు అతన్ని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించి, అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన విజయవాడకు బయలుదేరినట్లు సమాచారం.

ఏఐతో సీటీ ఎఫ్ఎఫ్ఆర్ ఆవిష్కరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ప్రివెంటివ్ హెల్త్ కేర్ రంగంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో సీటీ ఎఫ్ఎఫ్ఆర్ టెక్నాలజీని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడారు. ఇప్పటి వరకూ సీటీ యాంజియోగ్రామ్‌లో కాల్షియం స్కోర్ ఆధారంగా గుండెపోటు వచ్చే ముప్పును గుర్తించినట్లు తెలిపారు. ఇప్పుడు రోగ నిర్ధారణలో టెక్నాలజీతో పాటు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆ దిశగా ఏపీలోనే మొట్టమొదటిగా సీటీ ఎఫ్ఎఫ్ఆర్ పరీక్షను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. దీని ద్వారా అధునాతన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలు గుండె, మెదడు, క్యాన్సర్, జీనోమ్, సింగిల్ సెల్ అట్లాస్ వంటి అంశాలకు సంబంధించి హై రెజల్యూషన్ ఇమేజింగ్ ద్వారా వైద్య రంగంలో మరింత కచ్చితమైన రోగ నిర్ధారణ, చికిత్సలను అందించడంలో సహాయపడతాయన్నారు. గుండె ధమనుల వ్యాధి నిర్ధారణకు 80 శాతం మందికి క్యాథ్ యాంజియో అవసరం పడదన్నారు. క్యాథ్ యాంజియో ఇక కేవలం స్టెంటింగ్ కోసం మాత్రమేనని, రోగ నిర్ధారణ కోసం కాదని వివరించారు. ఈ సమావేశంలో పలువురు ఆస్పత్రికి చెందిన వైద్యులు పాల్గొన్నారు.

బాబాయ్‌పై కత్తితో దాడి



సత్యనారాయణపురం (విజయవాడసెంట్రల్): అన్నదమ్ముల మధ్య తలెత్తిన స్వల్పవివాదం కారణంగా ఓవ్యక్తిపై అతని అన్న కొడుకు కత్తితో దాడిచేయడంతో ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు నాగులపల్లి భావన్నారాయణ, భాస్కరరావు, రాము అన్నదమ్ములు. సోదరుల్లో చివరివాడైన రాము సీతన్నపేటగేటు, నూరి హాస్పటల్ ఎదురు వీధిలో నివాసముంటున్నాడు. ఈక్రమంలో ముగ్గురు అన్నదమ్ములు ఆదివారం రాము ఇంట్లో మద్యం సేవిస్తుండగా భావన్నారాయణ, భాస్కరరావు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. అనంతరం భావన్నారాయణ గాంధీనగర్‌లోని తన ఇంటికి చేరుకుని విషయాన్ని భార్యకు తెలిపాడు. ఆమె వెంటనే ఈ సమాచారాన్ని కొడుకు సాయిపవన్‌కు చెప్పగా, అతను తన స్నేహితుడు లావేటి సాయికుమార్‌తో కలసి సీతన్నపేటలోని జామి అప్పన్నవీధిలో ఉంటున్న తనబాబాయి భాస్కరరావుకు ఇంటికి వెళ్లి గొడవపడ్డాడు. వెంట తెచ్చుకున్న కత్తితో భాస్కరరావును కత్తితో పొడిచి పరారయ్యాడు. కత్తిపోట్ల కారణంగా తీవ్ర రక్తస్రావానికి గురైన భాస్కరరావును అతని కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం సమీపంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు సాయిపవన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆకట్టుకున్న సంగీత, నృత్య ప్రదర్శనలు



అన్నమయ్య కీర్తనలు గానం చేస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ నాట్యవేద (అకాడమీ ఆఫ్ డాన్స్ అండ్ మ్యూజిక్) ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి ఆధ్వర్యంలో చిన్నారులు అన్నమయ్య పదాలు, త్యాగరాజ స్వామి, రామదాసు కీర్తనలు మధురంగా ఆలపించారు. 80 మంది చిన్నారులు పలు సంప్రదాయ కీర్తనలకు నృత్యాలను అభినయించారు. సంగీత విద్వాంసుడు డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి మాట్లాడుతూ సంగీతం భగవదత్తమైన వరమని దానిని భగవత్ సేవగా భావంచాలని కోరారు. అన్నమయ్య, త్యాగరాజ స్వామి లాంటి వాగ్గేయ కారుల కీర్తనలలో తెలుగు భాష, నుడికారం కనిపిస్తుందన్నారు. జేఎంఎస్ నాట్యవేద వ్యవస్థాపకుడు జంగం శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ బాల బాలికల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వారిలోని కళాసంపదను వెలికి తీయాల్సిన అవసముందని తెలిపారు. జంగం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవలోనే జీవితం చరితార్థం



సామాజిక సేవకురాలు విజయలక్ష్మికి పురస్కారం అందచేస్తున్న లక్ష్మణ్‌బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగువారిలో ప్రతిఒక్కరూ తమతమ రంగంలో ఉంటూ సమాజ సేవలో తరించినప్పుడే వారి జీవితం చరితార్థమవుతుందని చిత్రకారులు, తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మండలి లక్ష్మణబాబు పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని తెలుగు వెలుగు సాహితీ వేదిక, కళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్యం, రచన, జ్యోతిష్యం, చిత్రకళ, ఇంద్రజాలికులు, స్వచ్ఛంద సేవ వంటి వివిధ రంగాలలోని లబ్ధప్రతిష్టులకు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ సేవారంగాలలో గుర్తింపు పొందిన వారిని గౌరవిస్తూ పురస్కారాలను అందించి ప్రోత్సహించిన నిర్వాహకులు అభినందనీయులని కొనియాడారు. నిర్వాహకులు డాక్టర్ లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల నేపథ్యంలో సమాజంలో వివిధ రంగాలకు చెందిన వారు ప్రజలకు అందిస్తున్న స్వచ్ఛంద సేవలకు తెలుగు వెలుగు సాహితీ వేదిక ద్వారా పురస్కారాలను ప్రదానం చేశామని వివరించారు. ముఖ్యంగా విజయవాడ విద్యాధరపురం కబేళా సెంటర్‌కు చెందిన వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ ముత్తంశెట్టి విజయలక్ష్మి నిస్వార్థంగా పేదలకు అందిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమన్నారు. చిత్రకారుడు స్ఫూర్తి శ్రీనివాస్ తమ చిత్రకళ స్కూల్ ద్వారా అనేక మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తూ చిత్ర కళాకారులకు స్ఫూర్తిగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, రాష్ట్ర యూత్ అధ్యక్షులు అద్దంకి నాగరాజు, సాహితీవేత్త రంగిశెట్టి రమేష్, కత్తి రమేష్, భాస్కరభట్ల సత్యప్రసాద్ శర్మ, పి.దుర్గాప్రసాద్, వేములవాడ రాధిక, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ వంగాల శాంతికృష్ణ, ఎమ్ దుర్గాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారులకు సత్కారం



సన్మానగ్రహీతలతో జగన్‌మోహనరావు, ఆకుల శ్రీనివాస్‌కుమార్, ఎన్.శ్రీహరి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇతిహాస పురాణ కాలం నాటి జనం నుంచి ఉద్భవించిందే జనపదమని, కాలక్రమంలో అదే జానపదమైందని ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీతశిల్పి డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల బొండా ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఆయన జానపద కళాకారులు దామోదర గణపతిరావు, ఉత్తరాంధ్రకు చెందిన వావిలపల్లి మోహనరావు, మంతెన సుశీల, మీసాల రమణ, పి.మన్మథరావు, కళాసేవకులు ముత్తంశెట్టి దుర్గాకిషోర్‌ను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేసే కళాకారులలో జానపద కళాకారులకు ఓ ప్రత్యేకత ఉందని అన్నారు. జానపద నృత్యాలలో కళాకారులు భక్తి, ప్రేమ, కరుణ, వీరత్వం తదితర భావోద్వేగాలను వ్యక్తీకరించే కథనాలు ఉంటాయని తెలిపారు. అటువంటి జానపద కళలు, కళాకారులను ఆదరించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వం, సమాజంపై ఉందని పేర్కొన్నారు. సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ జానపద కళారూపాల ద్వారా సమాజాన్ని జాగృతం చేస్తున్న కళాకారులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో నరహరిశెట్టి శ్రీహరి, రామినేని వెంకటేశ్వరరావు, బొండా లక్ష్మీకుమారి, అల్లం పూర్ణచంద్రరావు, పీవీ నాగరాజు, మార్తాండ కుమార్, న్యాయవాది వివేకానంద మూర్తి, విజయ సాయి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలిగితేనే రౌడీషీట్ ఎత్తివేత



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కొండలరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మంచి నడవడికతో జీవిస్తే వారిపై ఉన్న షీట్లు తొలగిస్తామని, ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే మాత్రం పీడీ యాక్ట్ అమలు చేస్తామని కొత్తపేట సీఐ కొండలరావు హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, క్రైం సస్పెక్టర్లకు ఆదివారం సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల దినచర్యపై ఆరా తీశారు. గడిచిన వారం రోజులుగా వారివారి జీవన విధానం గురించి పోలీసుల విచారణకు వచ్చిన వివరాలను తెలియజేశారు. మీరు నివసించే ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సత్ప్రవర్తనతో మెలిగే వారిపై ఉన్న షీట్లు తొలగిస్తామన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు రవాణా చేసే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పదేళ్లుగా ఎలాంటి కేసులు లేని రౌడీషీటర్లపై ఉన్న షీట్లు తొలగించి వారు సమాజంలో గౌరవంగా బతికేందుకు అవకాశం కల్పిస్తామని వివరించారు. స్థానికంగా ఎటువంటి గొడవలకు పాల్పడినా వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

స్థలం విక్రయిస్తామంటూ మోసం చేసిన వారిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థలం విక్రయిస్తామని చెప్పి ఓ వ్యక్తిని నమ్మించి మోసం చేసిన ఘటనపై భవానిపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు...వన్‌టౌన్ గొల్లపాలెంగట్టుకు చెందిన కనిశెట్టి లక్ష్మణరావు మరుపిళ్ల విజయలక్ష్మి పేరిట మైలవరం మండలం గణపవరంలో ఉన్న స్థలం కొనుగోలు చేసేందుకు 2022 జూలైలో ఒప్పందం చేసుకున్నాడు. ఆ సమయంలో లక్ష్మణరావు ఆమెకు రూ.5లక్షలు చెల్లించాడు. భూమి సర్వే నంబర్ బ్లాక్‌లో ఉన్నందున ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే సర్వే నంబరు బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించినప్పటికీ ఆస్థలాన్ని లక్ష్మణరావుకు రిజిస్ట్రేషన్ చేయకుండా మరుపిళ్ల విజయలక్ష్మి, ఆమె భర్త రవికుమార్ అదిగోఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. లక్ష్మణరావు ఇచ్చిన నగదు రూ.5లక్షలను రవికుమార్ షాపులో పనిచేస్తున్న వీఎస్ మణికుమార్ ద్వారా ఆయనకు తిరిగి ఇచ్చినట్లు, అందుకు లక్ష్మణరావు కూడా ఎకనాలెడ్జ్‌మెంట్ ఇచ్చినట్లు సృష్టించారు. ఈక్రమంలో తనకు స్థలం రిజిస్ట్రేషన్ చేయకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా విజయలక్ష్మి, ఆమెభర్త రవికుమార్ తనను మోసం చేశారంటూ లక్ష్మణరావు భవానీపురం పోలీసుస్టేషన్‌లో పిర్యాదు చేశాడు. వారినుంచి తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బుద్ధుని బోధనలే నేటి సమాజానికి ఆదర్శం



పటమట(విజయవాడతూర్పు): బుద్ధుని జీవితం, బోధనలు నేటి సమాజానికి ఆదర్శనీయమని, బుద్ధుడంటే జ్ఞానమని డాక్టర్ జంధ్యాల పరదేశీ బాబు అన్నారు. ఆదివారం సమభావన మిత్రమండలి సర్వసభ్య సమావేశం పటమటలోని వాసవ్య మహిళా మండలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధం సమాజ సమానత్వాన్ని, అహింసను, దీనజన సేవను, విశ్వమానవ ప్రేమను అందించిందని చెప్పారు. బుద్ధుని బోధనలు ప్రధానంగా సమానత్వం చాటాయని తెలిపారు. అనంతరం ఆయన్ను సమభావ మిత్రమండలి సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి అధ్యక్షుడు కోనేరు నరేంద్ర, టి. శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ పీవీఆర్‌కె ప్రసాద్, సీహెచ్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మంచు దుప్పటి

నగరాన్ని మంచుదుప్పటి కమ్మేసింది. వర్షాన్ని తలపిస్తూ పొగమంచు కురిసింది. ఉదయం తొమ్మిది గంటల సమయంలోనూ మంచు పరదాలు వీడలేదు. వాహనాలు లైట్ల వెలుగుల్లో ప్రయాణించాల్సి వచ్చింది. మంచు పరదాల్లో చిక్కుకున్న ప్రకాశంబ్యారేజీ, పరిసర ప్రాంతాలను ఈ చిత్రాల్లో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ